క్లుప్తంగా

వైద్య పరీక్షలు



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో చిన్నారులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోషక పదార్థాల వల్ల కలిగే మేలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు మనోజ్, అమిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాచాపూర్‌లో పశువైద్య శిబిరం



భిక్కనూరు: కాచాపూర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి దేవేందర్ పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. గ్రామంలోని పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి మందులు వేశారు. వచ్చే నెల 14 వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. పాల దిగుబడికి తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ప్రదీప్, భరత్, గోపాలమిత్రలు సురేష్, మహేష్‌గౌడ్, సందీప్ పాల్గొన్నారు.

వాటర్‌మన్‌లకు శిక్షణ




గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో వాటర్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్థానిక రైతు వేదిక భవనంలో మంగళవారం పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శిక్షణను ప్రారంభించారు. ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో రాజేశ్వర్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ప్రవీణ్ రెడ్డి, ఏఈ దామోదర్ రెడ్డి తదితరులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగుతుందని ఎంపీడీవో తెలిపారు.

మండల ప్రత్యేకాధికారి రత్నం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిగా రత్నం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఏడీఏ లక్ష్మీప్రసన్న ఇప్పటివరకు నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిగా కొనసాగారు. ఇటీవల ఎల్లారెడ్డి రెగ్యూలర్ ఏడీఏ రత్నం విధుల్లో చేరడంతో నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారి బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఎంపీడీవో ప్రభాకరచారి, సూపరింటెండెంట్ వినోద్ ఉన్నారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి



బీబీపేట: విద్యార్థులు ఎల్లప్పుడు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ అన్నారు. ప్రపంచ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం తుజాల్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గంజ్ జెడ్పీహెచ్ఎస్‌లో..



కామారెడ్డి టౌన్: చేతులు పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గంజ్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్ డే పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి కృష్ణహరి, సభ్యులు కాశీనాథం, భాస్కర్, హెచ్‌ఎం నీల లింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నాసాగర్ ప్రభుత్వ పాఠశాలలో..

ఎల్లారెడ్డి: అన్నాసాగర్ ప్రభుత్వ పాఠశాలను ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. హ్యాండ్ వాష్ డే సందర్భంగా ప్రతి ఒక్కరు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఎంపీవో ప్రకాష్ తదితరులున్నారు

మధ్యాహ్న భోజన తంటాలు

- నూతన ఏజెన్సీని నియమించాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు
- మాకు అన్యాయం చేస్తున్నారంటున్న పాత ఏజెన్సీ నిర్వాహకులు
- చివరికి నూతన ఏజెన్సీ ఏర్పాటు



పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బీబీపేట: పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో అటు పాత సభ్యులు, ఇటు విద్యార్థుల తలిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల వాగ్వాదం చినికి చినికి గాలివానలా తయారైంది. చివరికి నూతన ఏజెన్సీని నియమించడంతో గొడవ సద్దుమణిగింది. మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, గత నెల 21న వారిని రద్దు చేయడంతో పాటు నూతన ఏజెన్సీని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు అధికారులు తీర్మానం చేశారు. ఈ నెల 15న నూతన ఏజెన్సీని నియమించడానికి అధికారులు గడువు విధించారు. దీంతో కొంత మంది ఉత్సాహకులు భోజనం వండడానికి ముందుకు రావడంతో మంగళవారం పాఠశాలకు వెళ్లారు. అక్కడ పాత ఏజెన్సీ వారు సైతం వంట చేయడానికి ముందుకు వచ్చారు. తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని పాత నిర్వాహకులను వండనివ్వమని వాగ్వాదానికి దిగారు. అంతే కాకుండా సోమవారం ప్రజావాణిలో సైతం పాత ఏజెన్సీని రద్దు చేయాలని ఫిర్యాదు చేసి వచ్చారు. డీఈవో రాజు నూతన ఏజెన్సీని నియమించాలని ఎంఈవో అశోక్, పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డికి సూచించారు. దీంతో తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ముందే కొత్త వారిని నియమించారు. అయినప్పటికీ కొత్త వారిని వండనివ్వమని పాత ఏజెన్సీ వారు పట్టుబట్టడంతో చివరికి పోలీసులు వచ్చి వారిని నచ్చజెప్పి పంపించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ స్రవంతితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు వంటలు చేసే వరకు అక్కడే ఉండి విద్యార్థులు తిన్న తర్వాత వెళ్లిపోయారు. గత ఏజెన్సీ సభ్యులు వంట చేస్తే సగానికి పైగా విద్యార్థులు భోజనం చేసేవారు కాదని, ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకునే వారని, పాత ఏజెన్సీ నిర్వాహకులు ఎన్ని సార్లు చెప్పినప్పటికీ భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయడంతోనే వారిని రద్దు చేశామని ఎంఈవో అశోక్, హెచ్‌ఎం రవీంద్రారెడ్డి తెలిపారు.

'ఎల్‌ఆర్‌ఎస్' పరిశీలన వేగవంతం చేయాలి



పిట్లంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



నాగమడుగు లిఫ్ట్ వివరాలు తెలుసుకుంటూ..

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

పిట్లం(జుక్కల్): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. ఆమె పిట్లంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను, ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. పిట్లం మండలంలో మొత్తం 1648 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉండగా, వాటిలో 1350 వరకు పిట్లం మండల కేంద్రం నుంచే వచ్చాయన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో మొత్తం మూడు దశలలో పరిశీలన ఉంటుందని చెప్పారు. మొదటి దశలో జీపీ కార్యదర్శి, ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈ పరిశీలిస్తారని, రెండో దశలో డీఎల్‌పీవో, మూడో దశలో డీపీవో, అదనపు కలెక్టర్ పరిశీలన జరిపిన అనంతవరం దరఖాస్తుదారుడికి అప్రూవల్ ఇస్తామన్నారు. తహసీల్దార్ వేణు గోపాల్, ఆర్ఐ శీతల్, కార్యదర్శి యాదగిరి, ఇరిగేషన్ అధికారి రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ పనులను త్వరగా పూర్తి చేయండి

పిట్లం(జుక్కల్): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. ఆమె మంగళవారం ప్రాజెక్టు పనులను పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి పైప్‌లైన్ భూసేకరణ పనులు ఎంతవరకు వచ్చాయని తెలుసుకున్నారు.

పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలల్లో ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను, నిర్మాణంలో ఉన్న పాఠశాల డైనింగ్ హాల్, మరుగుదొడ్లను మంగళవారం సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ దశరథ్, ప్రత్యేక అధికారి కిషన్, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్, మండల వ్యవసాయ అధికారి కిషన్, దితరులు పాల్గొన్నారు.

నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తీర్మానం



ఎల్లారెడ్డి: పట్టణంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తీర్మానం చేసినట్లు ఏఎంసీ కార్యదర్శి తెలిపారు. మంగళవారం కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తీర్మానం చేసినట్లు చైర్మన్ తెలిపారు. వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత

రాజంపేట: అర్గొండ గ్రామానికి చెందిన సింధూజ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు ఆపరేషన్ తప్పనిసరి అని వైద్యులు చెప్పారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో స్థానిక నాయకులు ద్వారా ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను సంప్రదించారు. ఎమ్మెల్యే స్పందించి ఆపరేషన్ నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేసినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయిలో 163వ ర్యాంకు



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ విద్యార్థికి జాతీయస్థాయి అర్హత ప్రవేశపరీక్ష (సీఎస్ఐఆర్)లో 163వ ర్యాంకు వచ్చినట్లు రసాయన శాస్త్ర హెచ్‌వోడీ డాక్టర్ నాగరాజు మంగళవారం తెలిపారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వెంకటేష్‌ను ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

ప్రజాప్రతినిధులను సన్మానించిన అధికారులు



భిక్కనూరు: మండల కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారులు గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ స్వామిలను మంగళవారం రైతు వేదికలో సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, ఏవో రాధారెడ్డి, ఏఈవో వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమించాలి




భిక్కనూరు: ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం జంగంపల్లిలో సీపీఎం మండల ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగ్యారంటీలు పూర్తిగా అమలు కావడం లేదన్నారు. రుణమాఫీ పథకాన్ని వెంటనే రైతులందరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి సీపీఎం చేస్తున్న పోరాటానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. నేతలు కొత్త నర్సింలు, పేరం నరసవ్వ, బుడ్డ రామస్వామి, సిద్ధరాములు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులను వినియోగించుకోండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో ఉన్న డంపింగ్‌యార్డులను వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. నందివాడలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామంలో తొలగించిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను డంపింగ్‌యార్డులలో వేయాలని సూచించారు. కంపోస్టు షెడ్, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో సవితారెడ్డి, ఆర్ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్తపై వ్యాఖ్యలకు నిరసనగా బంద్



బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

బాన్సువాడ: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం బాన్సువాడలో ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బాన్సువాడ జమా మజీద్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బాన్సువాడలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. జమా మజీద్ నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మజీద్ అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ముస్లింలు తమ దుకాణాలను మూసి ఉంచారు.

సంక్షిప్తం

రైతులకు రూ.73 లక్షల రుణాల పంపిణీ

భిక్కనూరు: కాచాపూర్ సింగిల్ విండోలో 69 మంది రైతులకు రూ.73లక్షలను మంగళవారం పర్సన్ ఇన్‌చార్జి లింగాల కిష్టాగౌడ్ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తొగరి సుదర్శన్, జాంగారి గాలిరెడ్డి, నేతలు రాజాగౌడ్, భూపాల్‌రెడ్డి, కిష్టారెడ్డి, భూంరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ ప్రవేశాలకు గడువు పెంపు

బాన్సువాడ రూరల్ : ఓపెన్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు గడువును ఈ నెల 31 వరకు పొడిగించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదో తరగతికి రూ.1550తో పాటు రూ.100 అపరాధ రుసుము, ఇంటర్‌కు రూ.1800లతో పాటు రూ.200 అపరాధ రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించి ప్రవేశాలు పొందవచ్చు.

నేడు బీడీ కంపెనీ ముందు ధర్నా

కామారెడ్డి టౌన్: బీడీ కార్మికుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన సిరిసిల్ల రోడ్డులోని బీడీ కంపెనీ ముందు ధర్నా చేపడుతున్నట్లు సీఐటీయూ, బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కంపెనీ ప్రతినిధులు జిల్లా వ్యాప్తంగా కార్ఖానాలకు వెళ్లి ధర్నాలకు వెళ్లవద్దని కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

'గాలికుంటు' టీకాలను వేయించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పాడి పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి రమేష్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పశువులకు వైద్యచికిత్సలు నిర్వహించారు. గాలికుంటు రోగం వస్తే పాల ఉత్పత్తి తగ్గుతుందని, కట్టిన పశువులు ఇడచుకుపోయే ప్రమాదం ఉందన్నారు. సిబ్బంది పోచయ్య, కొండల్‌రెడ్డి,ప్రేం సింగ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ పండుగ

బాన్సువాడ రూరల్: ఇబ్రాహింపేట్‌లో మంగళవారం కట్టమైసమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామం నుంచి నైవేద్యాన్ని భాజాభజంత్రీల నడుమ చెరువు కట్ట వరకు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు బాగుండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రతిఏటా వరికోతలు ప్రారంభానికి ముందు పండుగను ఆనవాయితీగా చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా దర్గా ఉత్సవాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద గేట్ వద్ద గల సూఫీ షా మొహ్మద్ అబ్దుల్ వాహెద్ షత్తారీ ఉల్ ఖాద్రి దర్గా ఉత్సవాలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సూఫీషా మొహ్మద్ రహీం షత్తారీ ఉల్ ఖాద్రీ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. సంగారెడ్డి జిల్లా అన్నాసాగర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ సూఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ షత్తారీ ఉల్ ఖాద్రీ మాల్తుమ్మెద దర్గా వద్ద ఉత్సవాలను ప్రారంభించారు. మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నీలంరెడ్డి ఇంటి నుంచి గంధం, చాదర్‌లను ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాకు సమర్పించారు. దర్గా వద్ద ప్రత్యేకప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా వద్ద కవ్వాలి జరిపారు.

రైతులతో బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ వామన్‌రావు

పిట్లం(జుక్కల్): వరి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని మండల స్పెషల్ ఆఫీసర్(అదనపు డీఆర్‌డీవో) వామన్ రావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వడ్ల కొనుగోలు అంశంపై మండల స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వ్యవసాయ, సహకార సంఘాల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వామన్ రావు మాట్లాడుతూ.. ఈ నెల 16న అన్ని వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఎంపీడీవో కమలాకర్, మండల వ్యవసాయ అధికారి కమల, మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీకాంత్, ఏపీఎం శిరీష, మండల రెవెన్యూ గిర్దావర్ శీతల్, తదితరులు పాల్గొన్నారు.

వడ్లు ఆరబెట్టే యంత్రం ప్రారంభం



బీబీపేట: మండల కేంద్రంలోని సహకార కేంద్రం వద్ద మంగళవారం వడ్లను ఆరబెట్టే యంత్రాన్ని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు. రైతులు కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఈ యంత్రం ద్వారా సులువుగా ఆరబెట్టుకోవచ్చని ఆయన తెలిపారు. నేడు బీబీపేటతో పాటు ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రంగు శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి



భిక్కనూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆకతాయిల ఆటలు కట్టించేందుకు సీసీ కెమెరాలను దాతల సహకారంతో ఏర్పాటు చేయిస్తానని భిక్కనూరు మాజీ సర్పంచ్ తుక్కి వేణు అన్నారు. ఆయన మంగళవారం భిక్కనూరు ప్రభుత్వ పాఠశాలలో దుండగులు ధ్వంసం చేసిన వాటర్ ప్యూరిఫయర్, నల్లాలను పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు కేవీ సుబ్బారావు, బీఆర్ఎస్ నాయకుడు సరస్వతి ప్రభాకర్, విండో చైర్మన్ ఉప్పరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులను నిర్వహించాలని లింగంపేట మండల ప్రత్యేకాధికారి సురేందర్ సూచించారు. లింగంపేట రైతువేదికలో పలుగ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతోపాటు ఏఈవోలు, సొసైటీ సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించాలన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలుకేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని బాయంపల్లిలో ఫిష్‌పాండ్ యూనిట్‌ను పరిశీలించారు. డీపీఎం రమేష్‌బాబుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలోని శబరి మాత ఆశ్రమ 35వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం వద్ద గీతాపారాయణం, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. దీంతోపాటు అమ్మవారికి పల్లకీసేవను అంగరంగ వైభవంగా జరిపారు. శబరిమాత చిత్రపటాలను చేతబూనిన చిన్నారులు ఉత్సాహంగా పల్లకిసేవలో పాల్గొన్నారు. రాత్రంతా ఆశ్రమంలో భజన కార్యక్రమాలు చేపట్టారు.

నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి



దోమకొండ: ఎల్‌ఆర్‌ఎస్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.జ్యోతి అన్నారు. మంగళ వారం దోమకొండ జీపీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ టీమ్‌తో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడ్లారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు సమాచారం అందించి పరిశీలన చేయాలన్నారు. ప్రత్యేకాధికారితో పాటు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎల్‌ఆర్‌ఎస్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళులు



రామేశ్వర్‌పల్లిలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి తదితరులు



అడ్లూర్‌ఎల్లారెడ్డిలో.. స.హ.చట్టం పరిరక్షణ కమిటీ సభ్యులు

మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన భారతదేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి మిస్సైల్ మ్యాన్‌గా ఎదిగారని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



రామారెడ్డిలో..



ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..